క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలు



గూడూరు: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరిరోజు బుధవారం ఉదయం దోపుసేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ట్రాక్టర్‌పై గరుడ, హనుమత్ వాహనాలపై స్వామిని పట్టణ వీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం 12గంటలకు దోపుసేవ ఆలయానికి చేరుకోగానే, ఆలయ ప్రాంగణంలో చేసిన వసంతోత్సవ వేడుకలు భక్తులను కనువిందు చేసింది. అనంతరం మేళతాళాల నడుమ లక్ష్మీ నారాయణ స్వామి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో సమీప పాకాలవాగుకు తీసుకెళ్లారు.

సత్తా చాటిన విద్యార్థులు

కొత్తగూడ: పదో తరగతి సీబీఎస్ఈ విభాగంలో పొగుళ్లపల్లి ఏకలవ్య గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఇన్‌చార్జ్ ప్రిన్స్‌పాల్ అజయ్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. 56మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఆవేర రంజిత్(647) ప్రథమ, సాయికిరణ్ (630) ద్వితీయ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు.

ప్రతిభావంతులకు సత్కారం

కురవి: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో సీబీఎస్ఈ వార్షిక ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు ముగ్గురు బాలికలు అత్యధిక మార్కులు సాధించిన ప్రతిభావంతులకు బుధవారం సన్మానించారు. పాఠశాలలో 60/60 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లాలు తెలిపారు. బి.అక్షయ(613/700), జి.నందిని(571), వి.నందిని(569) మార్కులు సాధించినట్లు వివరించారు.

డీఈఓకు సన్మానం

డోర్నకల్: పదో తరగతి ఫలితాలు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఉత్సాహాన్ని ఇచ్చాయని బీసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్ తెలిపారు. పదో తరగతిలో జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడంతో బీసీటీయూ ఆధ్వర్యంలో బుధవారం డీఈఓ రవీందర్‌రెడ్డిని కలిసి సన్మానించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, వీరన్న, భార్గవాచారి, రామయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయానికి తాళం

తొర్రూరు: నాలుగేళ్లుగా చేసిన పనులను బిల్లులు చెల్లించడం లేదంటూ సౌండ్స్, డెకరేషన్ కాంట్రాక్టర్ బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపాడు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణానికి చెందిన జలగం శంకర్ సౌండ్స్, డెకరేషన్ కాంట్రాక్టర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మున్సిపాలిటీలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు సౌండ్స్, అలంకరణ పనులు చేయించాడు. దీనికి గానూ రూ.16లక్షల పైచిలుకు ఖర్చు అయ్యింది. దీనికి బిల్లులు చెల్లింపులు చేయకుండా పెండింగ్‌లో పెట్టారని పేర్కొంటూ బాధితుడు మున్సిపల్ కార్యాలయానికి తాళం వేశాడు. మున్సిపల్ కమిషర్ శాంతికుమార్ వివరణ కోరగా...పెండింగ్ పనులపై తననెప్పుడు సంప్రదించలేదని, ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు.

ఈ-పాస్ మిషన్‌తోనే ఎరువులు విక్రయించాలి

మహబూబాబాద్ రూరల్: ఎరువుల డీలర్లు ఈ-పాస్ మిషన్ ద్వారా మాత్రమే ఎరువుల విక్రయాలు జరపాలని మండల వ్యవసాయ అధికారి నారెడ్డి తిరుపతి రెడ్డి తెలిపారు. పట్టణంలోని రైతువేదిక కార్యాలయంలో ఇఫ్కో కంపెనీ ఆధ్వర్యంలో ఎరువుల డీలర్లకు నానో యూరియా ఉపయోగాలపై మండల వ్యవసాయ అధికారి నారెడ్డి తిరుపతి రెడ్డి బుధవారం వివరించారు. కార్యక్రమంలో ఇఫ్కో సేల్స్ మేనేజర్ విశాల్, కంపెనీ సిబ్బంది వీరన్న, డీలర్లు పాల్గొన్నారు.

మామిడి రైతు కుదేలు

- ఇటీవల కురిసిన వర్షాలకు నేల రాలిన కాయలు
- తీరని నష్టాలతో ఆందోళనలో కౌలు రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



రాలిన మామిడి కాయలు ఏరుతున్న కౌలు రైతు

కురవి: ఇటీవల కురిసిన అకాల వర్షాలు.. గాలివాన బీభత్సానికి నేలరాలిన మామిడి కాయలతో మామిడి తోటలను కౌలుకు తీసుకున్న రైతులు కుదేలయ్యారు. జిల్లా వ్యాప్తంగా మామిడి తోటల సాగు అధికంగా ఉంటుంది. మామిడి తోటలను ఎక్కువగా కౌలుకు తీసుకుని రైతులు సాగు చేస్తుంటారు. తోటలను యజమానుల వద్ద కౌలుకు తీసుకునే రైతులు మామిడి తోటల్లో మందు పిచికారీ చేయడం, నీరు పెట్టడం మొదలుకొని కాయలు కోసే మార్కెట్‌కు పంపే వరకు వారిదే బాధ్యత ఉంటుంది. జిల్లాలో చాలా ప్రాంతాల్లో మామిడి తోటలు తక్కువగా కాయలు కాశాయి. తీరా చేతికొచ్చే సమయంలోనే గత పదిరోజుల క్రితం గాలివాన బీభత్సానికి మామిడితోటల్లోని కాయలు నేలరాలిపోయి కౌలు రైతులను తీరని నష్టాలకు గురిచేశాయి. జిల్లాలో సుమారు 400వందల నుంచి500 వందల ఎకరాల్లో మామిడితోటలకు నష్టం వాటిల్లిందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మరియన్న తెలిపారు. నష్టపోయిన రైతుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక పంపించినట్లు తెలిపారు. లక్షల్లో మామిడి రైతులు నష్టపోయారు. నష్టపోయిన మామిడి రైతులకు ప్రభుత్వం పరిహారం కోసం కౌలుకు తీసుకుని సాగు చేసే రైతులు ఎదురుచూస్తున్నారు. నష్టపోయిన రైతుల వివరాలను మాత్రం అధికారులు ఉన్నతాధికారులకు పంపించినప్పటికీ పరిహారం వస్తుందో రాదో తెలియని పరిస్థితి నెలకొని ఉంది.

రూ.10లక్షలు నష్టపోయా..



బలపాల గ్రామంతోపాటు నాకున్న మామిడి తోటలోని కాయలన్నీ ఇటీవల గాలివాన బీభత్సానికి నేల రాలాయి. రూ.10లక్షలు నష్టపోయాను. 40టన్నుల మామిడికాయలు నేలరాలడంతో తీరనినష్టం వాటిల్లింది. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

- బాదావత్ బిక్కు నాయక్, కౌలు రైతు, బలపాల

గీత కార్మికుల ప్రాణాలకు అభయహస్తం

- ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్



కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: కల్లుగీత కార్మికుల ప్రాణాలకు అభయహస్తంగా కాటమయ్య రక్షణ కవచం కిట్లు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ, జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బుధవారం కట్లను పంపిణీ చేశారు. కల్లుగీత కార్మికుల భద్రత, ఆరోగ్యం, క్షేమం అన్నింటిని పరిగణలోకి తీసుకుని కాటమయ్య రక్షణ కవచాలను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహస్వామి, జిల్లా ఎక్సైజ్ అధికారి కిరణ్, సీఐ చిరంజీవి, బిక్షపతి, అశోక్, ఎస్సైలు మౌనిక, రవళి, నాయకులు బండారు వెంకన్న, పద్మం ప్రవీణ్ కుమార్, బెల్లంకొండ శ్రీనివాస్, బోడ రవి, సలువాది దిలీప్ పాల్గొన్నారు.

సంస్థాగత నిర్మాణమే పార్టీకి బలం

- ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



కురవి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

కురవి: సంస్థాగత నిర్మాణం పటిష్టంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని, పార్టీ కోసం నిరంతరం పనిచేసిన వారికి పదవులు వస్తాయని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వీరభద్ర ఫంక్షన్ హాల్‌లో సంస్థాగత నిర్మాణం-ప్రతిపాదనల స్వీకరణ కార్యక్రమం పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. పార్టీ పరిశీలకులు పోట్ల నాగేశ్వర్‌రావు, రవళిరెడ్డి సమక్షంలో దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మండల అధ్యక్ష పదవి కోసం 11 మంది, బ్లాక్ అధ్యక్ష పదవికి ఇద్దరు దరఖాస్తులు చేసుకున్నారు. కార్యక్రమంలో చైర్మన్‌లు గార్లపాటి వెంకటరెడ్డి, కొర్ను రవీందర్‌రెడ్డి, బండి శ్రీనివాస్, గొల్లపల్లి రజనీకాంత్, దడిగల శరత్, రాజేందర్‌కుమార్, రామునాయక్, శ్రీధర్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మరిపెడ: సంస్థాగత నిర్మాణంతో పార్టీ పటిష్టత మరింత పెరగాలని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ కోరారు. మండల కేంద్రంలోని ఆడిటోరియంలో బుధవారం కార్యకర్తల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘు వీరారెడ్డి, నాయకులు నూకల అభినవ్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ పెద్దబోయిన ఐలమల్లు పాల్గొన్నారు.

సమన్వయం లోపిస్తే పార్టీకి నష్టం

డోర్నకల్: కార్యకర్తలు, నాయకుల మధ్య సమన్వయం లోపిస్తే పార్టీకి నష్టం జరుగుతుందని ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ తెలిపారు. స్థానిక జైన్ భవన్‌లో జరిగిన పార్టీ సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షులు బత్తుల శ్రీనివాస్‌యాదవ్, మండల అధ్యక్షుడు జగదీష్, పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్‌చంద్ జైన్ పాల్గొన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రూ.20లక్షల నిధులతో చేపట్టిన బోరు, ఇతర పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్, ఏఈ శృతి పాల్గొన్నారు.

డీఎస్పీపై ఫిర్యాదు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ డీఎస్పీ ఎన్.తిరుపతిరావుపై ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌కు ఫిర్యాదు చేశామని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి దార ఇందుభారతి బుధవారం తెలిపారు. మహబూబాబాద్ పట్టణ పరిధిలో ఈనెల 10వ తేదీన పలువురు ఎలాంటి అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించారన్నారు. ఈ విషయంపై డీఎస్పీకి కాల్ చేసి అడుగగా ఆయన దురుసుగా మాట్లాడారని తెలిపారు. ఈ విషయంపై నేషనల్ చైల్డ్ హెల్ప్ లైన్ అధికారులకు కూడా ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం

మరిపెడ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మభ్యపెడుతున్నారని, అందుకు ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటమే ఏకైక మార్గమని సీపీఎం మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్ అన్నారు. బుధవారం మండలంలోని అబ్బాయిపాలెం గ్రామ శాఖ సమావేశంలో ఆయాన మాట్లాడారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని మే 19న ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నందిపాటి వెంకన్న, జిన్నా లచ్చయ్య, నందిపాటి వెంకన్న, బోడపట్ల రాజశేఖర్, కొండ ఉప్పలయ్య పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక

నెహ్రూసెంటర్: జిల్లా యాదవ విద్యావంతుల వేదిక కమిటీని ఎన్నుకున్నట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ బుధవారం తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా సందా కృష్ణ యాదవ్, ఉపాధ్యక్షుడిగా లెంకలపల్లి శ్రీనుయాదవ్, సింగం సరితయాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఉగ్గుల అశోక్‌యాదవ్, సహాయ కార్యదర్శిగా సంద మహేష్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

సర్కారు నిర్లక్ష్యంతోనే రైతు మృతి



పెద్దవంగర: పరామర్శిస్తున్న దయాకర్ రావు

పెద్దవంగర: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, సర్కార్ నిర్లక్ష్యంతోనే రైతు మృతి చెందాడని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. రామోజీ తండాకు చెందిన గుగులోత్ కిషన్ నాయక్ పోచంపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఇటీవల మృతి చెందాడు. బుధవారం మాజీ మంత్రి దయాకర్ రావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థికసాయం అందజేసి ఓదార్చారు. రూ. 25లక్షలు ఎక్స్‌గ్రేసియా రైతు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అందజేసి ఆదుకోవాలని పేర్కొన్నారు.

అండగా ఉంటాం..

తొర్రూరు రూరల్: ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందిన పల్లె యాకయ్య కుటుంబానికి పార్టీ పక్షాన అండగా ఉంటామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని కంఠాయపాలెం గ్రామంలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

నెల్లికుదురు: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని నైనాల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ట్రెయినీ ఎస్సై శివరామకృష్ణతో కలిసి ఎస్సై చిర్రరమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నైనాల గ్రామానికి చెందిన కొండపల్లి తేజ (26) గ్రామంలో మంగళవారం సాయంత్రం గ్రామంలో అందరితో కలిసి తిరిగినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన నారబోయిన సాయి తేజ మోటార్ సైకిల్ తాళం కోసం కొండపెల్లి తేజ ఇంటికి వచ్చి చూడగా దూలానికి వేలాడుతూ కనిపించాడు. దీంతో గ్రామస్తులతోపాటు హన్మకొండలో ఉంటున్న మృతుడి అక్క వల్లెపు జహ్నవి, గ్రామ బంధువైన ప్రకాష్‌రావుకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. వారందరు వచ్చి చూసే వరకు కప్పుకునే దుప్పటిని చింపి ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నట్లు తెలిపారు. తమ్ముడి మృతిపై అనుమానం ఉందని మృతుడి అక్క జాహ్నవి ఫిర్యాదులో పేర్కొందన్నారు. అనుమానాస్పద మృతిపై కేసు నమోదు చేసుకుని మృత దేహాన్ని పంచనామ నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై చిర్ర రమేశ్ బాబు తెలిపారు.

ఉరి వేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

మరిపెడ రూరల్: కుమారులు పట్టించుకోవడం లేదని మనస్తాపంతో ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని రాంపురం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. రాంపురం గ్రామానికి చెందిన గంగరబోయిన చంద్రయ్య (70) భార్య పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. కాగా చంద్రయ్యకు ఇద్దరు కుమారులు ఉండగా వారు బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నారు. స్వగ్రామంలో ఒంటరిగా ఉంటున్న చంద్రయ్యకు కుమారులు ఇద్దరు చెరో నెల చొప్పున వచ్చి తండ్రికి వండి పెడుతున్నారు. ఈక్రమంలో కొద్ది రోజులుగా ఇద్దరు కుమారులు తండ్రి వద్దకు రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై చంద్రయ్య ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు.

మరిపెడలో ఒకరు..

మరిపెడ: అనారోగ్యంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని శాంతి థియేటర్ వీధిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మరిపెడకు చెందిన నేతావత్ భద్రు (45) కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన భద్రు ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యుల గమనించి ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో అప్పటికే భద్రు మృతి చెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కార్మిక చట్టాలను అమలు చేయాలి



గూడూరు: కొనుగోలు కేంద్రం వద్ద మాట్లాడుతున్న వెంకన్న

గూడూరు: లేబర్ కోడ్లను రద్దు చేసి, కార్మిక చట్టాలను అమలు చేయాలని ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న, ఎంసీపీఐ (యూ) జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెకు కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఈసం రామయ్య, కటకం బుచ్చిరాములు, బందెల వీరస్వామి పాల్గొన్నారు.

కార్మికులు ఐక్యంగా ఉండాలి

కురవి: అసంఘటిత, సంఘటిత రంగాల్లోని కార్మికులందరు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సీఐటీయు ఆధ్వర్యంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 20న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని ప్రచారం చేసి, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పోతుగంటి మల్లయ్య, కరణం ముత్తయ్య, కంచం వీరన్న, రామచంద్రు, కొండ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయండి

కేసముద్రం: సీఐటీయూ అనుబంధ ఐకేపీ హమాలీ, కూలీ వర్కర్స్‌తో ఈనెల 20న చేపట్టనున్న గ్రామీణ సడక్ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్, సీనియర్ నాయకుడు చాగంటి కిషన్ అన్నారు. బుధవారం మండలంలోని కల్వల గ్రామంలో సంఘం ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కందిపాటి విజేందర్, రాజు, వెంకన్న, చంద్రమ్మ, సత్తయ్య, అరుణ్, హనుమంతు, మల్లయ్య, అనిల్, భిక్షం పాల్గొన్నారు.

దంతాలపల్లి: కార్మికలోకం తమ హక్కుల కోసం మే 20న తల పెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం సమ్మె వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు యాకయ్య, కొమురయ్య, యాకయ్య, సంతోష్, భిక్షపతి పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

గార్ల: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ట్రెయినీ ఎస్సై ఎస్‌డీ మైబూబి బుధవారం తెలిపారు. గార్ల లోని జెండాబజారుకు చెందిన ఎస్‌డీ సమీనా ఇంట్లో ఎవ్వరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. గార్ల చుట్టు పక్కల వెతికినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. ఈమేరకు ఆమె భర్త షారూక్ స్థానిక పోలీస్‌స్టేషలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

సెల్‌ఫోన్ అప్పగింత



కురవి: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి కురవి పీఎస్సై కృష్ణారెడ్డి బుధవారం అందజేశారు. బొమ్మెర సంపత్ అనే వ్యక్తి ఈనెల 1వ తేదీన తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. సీఈఐఆర్ ఆపరేటర్ జె.నరేష్ విచారణ చేసి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించినట్లు తెలిపారు. బాధితుడు సంపత్‌కు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు.

ఘనంగా బండ్లు తిరుగడం..

నర్సింహులపేట: మండల కేంద్రంలో కపిలగిరి పర్వతంపై వెలసిన శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ వేడుకల్లో భాగంగా బుధవారం ఆలయ సన్నిధిలో కనుల పండువగా బండ్లు తిరిగే కార్యక్రమం నిర్వహించారు.

జీపీ ట్రాక్టర్ బోల్తా..

కేసముద్రం: ప్రమాదవశాత్తు జీపీ ట్రాక్టర్ బోల్తా కొట్టిన సంఘటన మండలంలోని అర్పనపల్లి గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాట్రపల్లి గ్రామపంచాయితీ అవసర నిమిత్తం, ఇటీవల అర్పనపల్లి గ్రామపంచాయతీకి చెందిన జీపీ ట్రాక్టర్ ట్యాంకర్‌ను తీసుకెళ్లారు. తిరిగి ట్యాంకర్‌ను అప్పగించేందుకు, కాట్రపల్లి జీపీ ట్రాక్టర్ ఇంజన్‌కు ఆ ట్యాంకర్‌ను తగిలించుకుని అర్పనపల్లికి బయలుదేరగా, మార్గమధ్యంలో ఒక్కసారిగా పశువులు అడ్డురావడంతో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో ట్రాక్టర్‌ను నడుపుతున్న జల్లె ప్రశాంత్ కిందకు దూకడంతో అతడికి స్వల్పగాయాలయ్యాయి. ఈ మేరకు 108లో అతన్ని మానుకోట జనరల్ ఆసుపత్రికి తరలించారు.

సరుకుల పంపిణీ

దంతాలపల్లి: మండలకేంద్రానికి చెందిన సోమారపు మైసమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. కుటుంబ పరిస్థితి తెలుసుకున్న మండల కేంద్రానికి చెందిన సామాజిక వేత్త సేను రాజేష్ బుధవారం బాధిత కుటుంబానికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశాడు.

మహాసభను జయప్రదం చేయాలి

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీసాయి గార్డెన్‌లో ఈనెల 18న జరగనున్న సివిల్ సప్లయి హమాలీ యూనియన్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి మంద భాస్కర్, సీపీఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్ అన్నారు. బుధవారం మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వడ్డెబోయిన లక్ష్మీనర్సయ్య, రాజబోయిన శ్రీను, యాకయ్య పాల్గొన్నారు.

మండల అధ్యక్షుడిగా రమేశ్‌నాయక్

నెహ్రూసెంటర్: సేవాలాల్ సేనా మండల అధ్యక్షుడిగా మండలంలోని వేంసూర్ గ్రామ శివారు పెద్ద లింగ్యాతండాకు చెందిన బోడ రమేశ్‌నాయక్‌ను నియమిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోత్ నందులాల్‌నాయక్ బుధవారం తెలిపారు.

అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యం

డోర్నకల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని కిసాన్ పరివార్ సీఈఓ డాక్టర్ వివేక్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా డోర్నకల్ నియోజకవర్గంలో అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

గూడూరు: స్వచ్ఛమైన తాగునీటిని తాగుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ అన్నారు. మండలంలోని ఊట్ల గ్రామంలో బుధవారం అధికారిక పర్యటనలో భాగంగా మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు.

కూలీలకు పరిహారం చెల్లించాలి

కొత్తగూడ: తునికాకు సేకరణలో భాగంగా వివిధ కారణాలతో గాయపడిన కూలీలకు ప్రభుత్వం పరిహారం అందించాలని తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల రాము డిమాండ్ చేశాడు. మండలకేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

నీటిని ఏజెన్సీ ప్రాంతానికి మళ్లించాలి

బయ్యారం: గోదావరిపై నిర్మించిన సీతారామ ప్రాజెక్టు నీటిని ఏజెన్సీ ప్రాంతానికి మళ్లించాలని గోదావరి జలసాధన సమితి చైర్మన్ విశ్వ జంపాల ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన మాట్లాడారు. ఇల్లెందు, మహబూబాబాద్, డోర్నకల్ ప్రాంతాల్లోని రైతుల భూములకు నీరందిస్తామని బీఆర్ఎస్ పాలనలో మొదట డిజైన్ చేసిన పాలకులు ఆ తరువాత డిజైన్ మార్చడం వెనుక ఉన్న కుట్రను కాంగ్రెస్ ప్రభుత్వం బహిర్గతం చేయాలన్నారు. ఇప్పటికైనా మొదట డిజైన్ ప్రకారం ఏజెన్సీ ప్రాంతానికి తాగు, సాగునీరు అందించాలన్నారు.

పరామర్శ..

చిన్నగూడూరు: మండలంలోని గుండంరాజుపల్లి గ్రామానికి చెందిన సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గునిగంటి రాజన్న, జిల్లా కమిటీ సభ్యుడు గునిగంటి మోహన్, డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్‌ల తండ్రి గునిగంటి బుచ్చయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ బుచ్చయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

దాడి కేసులో నలుగురి అరెస్టు

కురవి: భూవివాదంలో ఓ వ్యక్తిపై దాడి చేసిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ట్రెయినీ ఎస్సై కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కంచర్లగూడెం గ్రామంలో గత నెల 27వ తేదీన చిలువేరు అనిల్‌పై అతని మామ శనిగచర్ల మురళీకృష్ణ, కుటుంబసభ్యులు శనిగచర్ల ప్రవీణ్‌కుమార్, వెంకన్న, కళమ్మలు అనిల్ ఇంటికి వెళ్లి విచక్షణారహితంగా దాడి చేసి కొట్టడంతో తీవ్రగాయాలైనట్లు ఆయన వివరించారు. అనిల్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అడుగుకో గుంత

- గాయాలపాలవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



ప్రమాదకరంగా ఉన్న పెద్ద గుంతలు



గుంతల్లో మురుగు నీరు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని జంగిలిగొండ, కురవి మండలం నేరడ గ్రామం, చిన్నగూడూరు మండలానికి వెళ్లే దారిలో గల జంగిలిగొండ క్రాస్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. మూడు మండలాలను కలుపుతూ ఉన్న ప్రధాన రహదారి క్రాస్ రోడ్డు చౌరస్తా వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంసమై తరచూ వాహన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గుంతలమయంగా మారిన రోడ్డు మీదుగా వాహనాలు వచ్చి వెళ్తున్న సమయంలో అ గుంతల్లో ద్విచక్రవాహనాల టైర్లు ఇరుక్కుని వానదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మూడు మండలాల సమీప గ్రామాల పరిధిలో గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు జరుగుతున్న సందర్భంగా భారీ వాహనాలు ఇదేమార్గం గుండా వెళ్లడంతో రహదారి పూర్తిగా ధ్వంసమై ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. జిల్లా కేంద్రం నుంచి జంగిలిగొండ, వీ.ఎస్.లక్ష్మీపురం, సింగారం, నేరడ, రాయినిపట్నం, తట్టుపల్లి, కేవుల తండా, చిన్నగూడూరు, ఉగ్గంపల్లి, ఎల్లంపేట, గుండంరాజుపల్లి, రాజుల కొత్తపల్లి, వంతడుపుల, కౌసల్యదేవిపల్లి గ్రామాలకు వెళ్లేవారు, వాహనదారులు, ఆర్టీసీ బస్సులు ఇతర వాహనాలు ఇదే ప్రధాన రహదారి మీదుగా రాకపోకలు కొనసాగిస్తుంటాయి. ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు స్పందించి జంగిలిగొండ క్రాస్ రోడ్డు వద్ద ప్రమాదాలకు నిలయంగా మారిన ప్రాంతంలో శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదాలు



గ్రామ క్రాస్ రోడ్డు వద్ద గుంతలమయంగా మారిన రహదారితో ప్రతిరోజు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారి పనుల కోసం వచ్చి వెళ్లే భారీ వాహనాలు అతివేగంగా వెళ్లడం ద్వారా రోడ్డు పూర్తిగా ధ్వంసమవుతుంది.

- నలమాస సుధాకర్, జంగిలిగొండ

ఇష్టారాజ్యంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నెల్లికుదురు: ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో కాంగ్రెస్ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అర్హులకు అన్యాయం చేస్తున్నారని, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమక్రసీ రాష్ట్ర నాయకుడు బండారి అయిలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఈమేరకు బుధవారం పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి ఎంపీఓ పద్మకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు హెచ్ లింగన్న, దేవేందర్, ఉడుగుల లింగన్న, యాకన్న, అనిల్, సాజన్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మహబూబాబాద్ :
9010144453
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్ పాషా, (S.R) : 7997958185
బి. సతీష్ (S.R) (డోర్నకల్) : 9640394736
ఎం. మురళి, (S.R) (తొర్రూరు) : 7680822646